క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో సెప్టెంబర్ 1న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. కాశిబుగ్గ నుంచి పోచమ్మమైదాన్ రోడ్డు, చార్‌బౌళి, నిజాంపుర, మండిబజార్, ఎల్‌బీనగర్, జీఆర్‌గుట్ట, లక్ష్మీపూర్, కూరగాయల మార్కెట్, దేశాయిపేట, ఏనుమాముల మార్కెట్, మహారాజుల కాలనీ, బాలాజీ నగర్ కూడలి, ఎంహెచ్‌నగర్, నజ్రత్‌పుర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

లింగయ్యకు రాధాకృష్ణ పురస్కారం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం ఇన్‌చార్జ్ అధిపతి డాక్టర్ ఎం.లింగయ్య.. సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ గుంటూరులోని చలపతి ఇంజనీరింగ్ విద్యాసంస్థలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ అసోసియేషన్ సంస్థ ఆదివారం అందజేసింది. ఈ సందర్భంగా లింగయ్యకు నిర్వాహకులు ప్రశంసపత్రంతో పాటు జ్ఞాపిక అందజేసి అభినందించారు.

తెలంగాణ వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడిగా సంపత్



కాజీపేట: తెలంగాణ వడ్డెర సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా గండికోట సంపత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు కాజీపేట మండలం రాంపురం గ్రామానికి చెందిన సంపత్‌కు హైదరాబాద్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలయ్య ఆదివారం నియామక పత్రం అందజేశారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్లుగా పల్లపు మల్లికార్జున్, నాగరాజు, నగర అధ్యక్షుడిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

సీపీఎం పట్టణ కార్యదర్శిగా సారంగపాణి

కాజీపేట: సీపీఎం కాజీపేట పట్టణ శాఖ కార్యదర్శిగా రామంచ సారంగపాణి నియమితులయ్యారు. ఈ మేరకు సారంగపాణికి మండల పార్టీ కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య ఆదివారం ఉత్తర్వులు అందజేశారు.

బాధితులకు అండగా ఉంటాం




రామన్నపేట: ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన రామన్నపేట రఘునాథ్ కాలనీకి చెందిన ఎలకలపెల్లి సురేష్ కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుందని పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ హామీ ఇచ్చారు. ఈ మేరకు బాధితులను ఆదివారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం, కార్పొరేషన్ అధికారులు తక్షణమే స్పందించి నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

మౌస్‌డీర్ దత్తత



న్యూశాయంపేట: జంతువుల సంరక్షణ, దత్తత కార్యక్రమంలో భాగంగా లయన్స్ క్లబ్ హనుమకొండ బాధ్యుడు లయన్ గిల్లా పురుషోత్తం తన మనుమరాలు రాణి సుమేధ పుట్టిన రోజు సందర్భంగా మౌస్‌డీర్‌ను దత్తత తీసుకున్నారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని కాకతీయ జూలాజికల్ పార్కులో ఉన్న మౌస్‌డీర్ వార్షిక దాణా ఖర్చుల నిమిత్తం ఆదివారం 12 వేల రూపాయల చెక్కును జూపార్కు ఫారెస్ట్ బీట్ అధికారి శారదకు అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తేరాల రమేశ్‌బాబు, వివేకానంద, శ్రీధర్‌రెడ్డి, నిర్మల, రమణారెడ్డి, సుభాష్, శ్రీనివాస్, రాజశేఖరం, బి.అశోక్, ప్రభాకర్, కిరణ్మయి, మోహన్‌రెడ్డి, ప్రభాకర్, విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మహా అన్నదానం



అన్నం వడ్డిస్తున్న సీతారాంరెడ్డి

హన్మకొండ అర్బన్: బాలసముద్రంలోని ఈఫిల్ టవర్ సమీపంలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయగా, అభివృద్ధి కమిటీ చైర్మన్ నామిరెడ్డి సీతారాంరెడ్డి – హంద్రాదేవి ఆధ్వర్యంలో ఆదివారం మహా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఊపందుకున్న వరిసాగు

- ఇటీవల కురిసిన వర్షాలతో నిండిన బావులు, చెరువులు
- నడికూడ మండలంలో 7,500 ఎకరాల్లో సాగు
- రైతులను వేధిస్తున్న కూలీల కొరత



నడికూడ మండల కేంద్రం శివారులో సాగవుతున్న వరి

నడికూడ : ఈ ఏడాది వానాకాలం ఆలస్యమైనా వరి సాగు ఊపందుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు వాగులు, చెరువుల్లో వరద నీరు చేరడంతో పాటు వ్యవసాయ బావుల్లో ఆశించినంత వరద నీరు చేరింది. దీంతో రైతన్నలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఒకేసారి వ్యవసాయ పనులు మొదలుపెట్టడంతో గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడింది. మండలంలోని చుట్టుపక్కల గ్రామాల నుంచి కూలీలను తీసుకొచ్చి పనులు ముమ్మరం చేస్తున్నారు. ఆలస్యమైతే నారు ముదిరిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

7,500 ఎకరాల్లో వరి సాగు

మండల వ్యాప్తంగా సుమారు 7,500 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు అవుతున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. గత ఏడాది కంటే ఈసారి అదనంగా 1400 నుంచి 1500 ఎకరాల్లో వరి సాగు అవుతున్నట్లు తెలుపుతున్నారు. అయితే కూలీల కొరత వల్ల పెట్టుబడి పెరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీలను ఆటోలు, ట్రాలీల్లో తీసుకొచ్చి ఒక్కొక్కరికి రూ.400 నుంచి రూ.450తో పాటు ఆటో చార్జీలు ఇస్తున్నారు.



వరిని పరిశీలిస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారి పోరిక జైసింగ్ (ఫైల్)

పెట్టుబడి పెరిగింది



నాట్లు వేసేందుకు కూలీలు దొరకడం లేదు. వివిధ గ్రామాల నుంచి కూలీలను తీసుకురావడంతో అదనంగా రూ.400 చెల్లించాల్సి వస్తోంది. దీంతో పెట్టుబడి పెరుగుతుంది.

– వరికెల కిషన్‌రావు, రైతు-నర్సక్కపల్లి

ఆందోళన చెందొద్దు



మండలంలో ఆలస్యంగా నాటు వేసిన రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వరిసాగులో ఏదేని సమస్య, సందేహాలు ఉంటే వెంటనే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలి. మండలంలో యూరియా కొరత లేదు. కావాల్సినంత అందుబాటులో ఉంది.

– జైసింగ్, ఏఓ

సంక్షిప్తంగా

జీవితంపై విరక్తిచెంది ఒకరి ఆత్మహత్య



ఎల్లాగౌడ్ (ఫైల్)

ఐనవోలు : పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని వనమాల కనపర్తి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గడ్డం ఎల్లాగౌడ్ (55) వ్యవసాయం, కులవృత్తైన గీత కార్మికుడిగా జీవనం కొనసాగించేవాడు. అయితే ఐదేళ్ల క్రితం తాటిచెట్టు పైనుంచి కింద పడగా అతడి కాలు విరిగింది. అప్పటి నుంచి ఏ పని చేయకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. దీంతో జీవితంపై విరక్తితో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మద్యం తాగేందుకు భార్య రజితను డబ్బులు అడుగగా భార్యాభర్తల నడుమ గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన ఎల్లాగౌడ్ పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉండగా ఒకరికి వివాహం కావాల్సి ఉంది. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు.

సీపీఎం కార్యదర్శిగా లింగయ్య



కాడబోయిన లింగయ్య

ఐనవోలు : సీపీఎం మండల కార్యదర్శిగా కాడబోయిన లింగయ్య మరోమారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా నారాయణరెడ్డి, మడిగ నాగరాజు, దీకొండ ఉప్పలయ్య, రామ్‌కుమార్, మహేందర్, జక్కుల గోపి, దర్శనాల సంపత్ ఎన్నికయ్యారు. తమపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులకు నూతన కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటామని వెల్లడించింది.

ఉద్యోగ విరమణ సహజం



రమేష్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

హసన్‌పర్తి: ఉద్యోగికి విరమణ సహజమని ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ ఎస్ఈ మధుసూదన్ రావు అన్నారు. నాగారం లైన్ ఇన్‌స్పెక్టర్‌గా రౌతు రమేష్ విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందగా, ఆదివారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో మధుసూదన్‌రావు మాట్లాడారు. రమేష్ ఓ వైపు విద్యుత్‌శాఖలో ఉద్యోగం చేస్తూనే మరో వైపు దళిత సంఘాల తరఫున పోరాటాలు చేసిన నాయకుడని కొనియాడారు. విద్యుత్‌శాఖలో 32 ఏళ్లపాటు నిబద్ధతతో సేవలు అందించారని అభినందించారు. నాగారం సబ్‌స్టేషన్ ఏఈ తరుణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.దానయ్య, హసన్‌పర్తి ఏఈ శిరీష్‌కుమార్, లైన్‌మెన్లు సురేష్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, ఎస్ఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైల్వే సంఘ్ నాయకులకు స్వాగతం

కాజీపేట రూరల్: రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ నాయకులకు కాజీపేట రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు కాజీపేట జంక్షన్‌లో ఆదివారం స్వాగతం పలికారు. న్యూఢిల్లీలో ఈనెల 2నుంచి 4వ తేదీ వరకు జరగనున్న నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే మెన్ (ఎన్ఎఫ్ఐఆర్) 31వ జాతీయ సదస్సుకు ప్రత్యేక రైల్లో వెళ్తూ మార్గమధ్యలో సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ జి.ప్రభురాజ్‌తో పాటు డివిజన్ నాయకులు వేగి మురళీకృష్ణ, ఎన్‌వీఎస్.చౌదరి, సత్యకుమార్‌రెడ్డి, మధు, రవిశంకర్, వినోద్, సునీల్‌కుమార్ కాజీపేట జంక్షన్‌లో దిగగా, వారికి కాజీపేట రైల్వే సంఘ్ నాయకులు స్వాగతం పలికారు.

తరగతులను అడ్డుకున్న 'బీఆర్ఎస్వీ'

హన్మకొండ: హనుమకొండ సర్క్యూట్ హౌస్ రోడ్డులోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఆదివారం తరగతులు నిర్వహిస్తుండగా బీఆర్ఎస్వీ నాయకులు అడ్డుకున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా తరగతులు ఎలా నిర్వహిస్తారని నిర్వాహకులను ప్రశ్నించారు. సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులపై భారం మోపొద్దని సూచించారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



విద్యను బోధించిన ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 2009–10 విద్యా సంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 15 ఏళ్ల తర్వాత ఒకరినొకరు తాము చదువుకున్న స్కూల్‌లో కలుసుకుని సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. సామూహిక భోజనాలు ఏర్పాటు చేసుకుని స్నేహభావాన్ని చాటారు. కలకాలం స్నేహం కొనసాగించాలని, కష్టాల్లో ఉన్న మిత్రులకు అండగా నిలవాలని, వీలైతే సామాజిక సేవలు అందించాలని ఐక్యంగా నిర్ణయించుకున్నారు. అనంతరం తమకు బాల్యంలో విద్యాబోధన అందించిన నాటి ప్రధానోపాధ్యాయురాలు విజయ, ఉపాధ్యాయులు భద్రయ్య, రావుల భాస్కర్‌రావు, తండా ప్రభాకర్, సోమయ్య, విజయలక్ష్మి, తిరునహరి నిర్మల, మారం రోజారాణి, మీనాకుమారి, ఉప్పలయ్యలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు కోల రాజు, కొమ్ము ప్రభాకర్, రహీమ్, బోయిని సంపత్, బాధ అశోక్, పోతర్ల సుధాకర్, నాయిని శ్రీను, సుమన్, చిర్ర అశోక్, టి.సరిత, స్వప్న, భవానీ, స్వాతి, శిరీష, రమేశ్, శ్రీనివాస్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

స్తంభాలపై కేబుల్స్ అస్తవ్యస్తం

- తొలగింపులో అధికారుల నిర్లక్ష్యం

సంగెం : మండలంలోని పలు విద్యుత్ స్తంభాలపై టీవీ, ఇంటర్నెట్ కేబుల్ వైర్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వాటిని సరి చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా క్రమ పద్ధతిలో కేబుల్ వైర్లు ఉంచాల్సి ఉండగా అందుకు భిన్నంగా గందరగోళంగా ఏర్పాటు చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లను తొలగించడంలో విద్యుత్ శాఖ అధికారులు తాత్సారం చేయడంలోని ఆంతర్యం తెలియడం లేదు.

మండలంలోని సంగెం, కుంటపల్లి, తిమ్మాపూర్, తీగరాజుపల్లి, గవిచర్ల, కాపుల కనిపర్తి తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు టీవీ, ఇంటర్నెట్ సంబంధిత కేబుల్ వైర్లు అస్తవ్యస్తంగా ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల కేబుల్ వైర్లు తెగి కిందకు వేలాడుతూ వాహనచోదకులను, ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. వేలాడుతున్న తీగలు తగిలి వాహనచోదకులు ప్రమాదాల బారిన పడిన ఘటనలూ ఉన్నాయి. కేబుల్ వైర్లు అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి మండలంలోని అన్ని గ్రామాల్లోనూ విద్యుత్ స్తంభాలపై అస్తవ్యస్తంగా ఉన్న కేబుల్ వైర్లను తొలగించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట విద్యుత్ స్తంభంపై అస్తవ్యస్తంగా ఉన్న కేబుల్స్

తొలగించాలని ఆదేశించాం

పలు చోట్ల విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు విద్యుత్ ఉద్యోగులు స్తంభాలు ఎక్కడానికి కేబుల్ వైర్లు అడ్డంకిగా మారాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు అస్తవ్యస్తంగా ఉన్న కేబుల్ వైర్లను వెంటనే తొలగించాలని సంబంధిత కేబుల్ ఆపరేటర్లకు తెలియజేశాము.

– మధుసూదన్, ఏఈ, ట్రాన్స్‌కో


సైకిల్ వినియోగం.. ఆరోగ్యానికి మేలు



సైకిల్ ర్యాలీలో శ్రీనివాసరావు, వలంటీర్లు

రామన్నపేట: సైకిల్ వాడకం ద్వారా కాలుష్య నియంత్రణతో పాటు ఆరోగ్యానికి మేలు కలుగుతుందని ఏవీవీ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కోడిమాల శ్రీనివాసరావు తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ఆరోగ్యవంతమైన దేశం కోసం ఆరోగ్యవంతమైన యువత' అనే అంశంతో ఏవీవీ కళాశాల నుంచి పోచమ్మమైదాన్ మీదుగా ఎంజీఎం సర్కిల్ వరకు ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రోజూ కనీసం 30 నిమిషాలు లేదా రెండు నుంచి ఐదు కిలోమీటర్ల వరకు సైకిల్ తొక్కితే ఆరోగ్యకరంగా ఉంటారని అనేక అధ్యయనాల్లో వెల్లడైందని, వైద్యులు కూడా సూచించారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ వలంటీర్లు దేవిశ్రీప్రసాద్, ఎన్.క్రాంతి, కె.సాకేత్, సాయి హర్షిత్, అర్జున్ కార్తికేయ, రాజ్‌కుమార్, నీరజ్, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



హన్మకొండ చౌరస్తా: సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో యోగా సాధకులకు నేత్రదానంపై ఆదివారం అవగాహన కల్పించారు. ఆ సందర్భంగా గార్డెన్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, రిటైర్డ్ డీఎఫ్ఓ పురుషోత్తం మాట్లాడారు. ఒకరి నేత్రదానం ఇద్దరికి చూపునిస్తుందని వివరించారు. ఈ మేరకు నేత్రాలతో పాటు అవయవ దానం పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు శంకర్‌రావు, యోగా గురువులు గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, సంపత్‌కుమార్, వి.శ్రీనివాస్, నర్సయ్య, యోగా సాధకులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్సై



క్షతగాత్రుడిని వాహనంలోకి ఎక్కిస్తున్న ఎస్సై అశోక్, స్థానికులు

దామెర : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన వ్యక్తిని పోలీస్ వాహనంలో ఆస్పత్రికి తరలించి స్థానిక ఎస్సై కొంక అశోక్ మానవత్వం చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెట్రోలింగ్‌లో భాగంగా ఎస్సై అశోక్ మండల కేంద్రం నుంచి ల్యాదెళ్లకు తమ వాహనంలో వెళ్తున్నారు. ఈ క్రమంలో పరకాల మండలం పోచారం గ్రామానికి చెందిన మనోహర్ ద్విచక్రవాహనంపై హనుమకొండకు వస్తున్నాడు. ఈ క్రమంలో మండల కేంద్రానికి చేరుకోగానే ద్విచక్రవాహనానికి కోతి అడ్డు వచ్చింది. దీంతో అదుపుతప్పి కిందపడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ఎస్సై 108కి సమాచారం అందించారు. అంబులెన్స్ వచ్చేందుకు కొంత సమయం పట్టేలా ఉందనే ఉద్దేశ్యంతో తమ వాహనంలో క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తుండగా ఆరెపల్లి వద్ద అంబులెన్స్ ఎదురవడంతో అందులో ఎక్కించి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఎస్సైతో పాటు కానిస్టేబుల్ శ్రీనివాస్, డ్రైవర్ రాజును స్థానికులు, పలువురు అభినందనలు తెలిపారు.

భక్తులకు అన్నప్రసాదాల వితరణ



ఆత్మకూరు : వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు



కమలాపూర్ : ప్రసాదం తింటున్న భక్తులు



శాయంపేట : అన్నప్రసాద వితరణ చేస్తున్న శంకర్, తదితరులు

కమలాపూర్ : గణపతి నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని వినాయక మండపాల వద్ద ఆదివారం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో శ్రీకంఠ మహేశ్వర కళామండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద కూనూరి రమేశ్‌బాబు–కోమల, కొండి అరుణ్–స్వాతి దంపతులు, స్నేహ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద పల్లె కొమురారెడ్డి, పల్లె జ్యోతి–తిరుపతిరెడ్డి దంపతులు, యువ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద, రాములపల్లిలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు, అంబాలలో ఏఎంసీ డైరెక్టర్ విజేందర్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కంఠమహేశ్వర కళామండలి వద్ద ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, అంబాలలో ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఏఎంసీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి అన్నప్రసాద వితరణ ప్రారంభించి భక్తులకు వడ్డించారు. అంతకుముందు వారు వినాయకులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళామండలి, భక్త భజన మండళ్ల నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని సూర్యానాయక్‌తండాలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గూగులోతు శంకర్ ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ చేశారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని శంకర్ తెలిపారు. మాజీ సర్పంచ్ రమేశ్, రవీందర్, సునీల్, భాస్కర్, శోభన్, సదర్‌లాల్, జగన్, భక్తులు పాల్గొన్నారు.

స్నేహ యూత్ ఆధ్వర్యంలో..

పరకాల : గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా పట్టణంలోని స్నేహ యూత్ ఆధ్వర్యంలో భక్తులకు ఆదివారం మహా అన్నదానం చేపట్టారు. చందుపట్ల రాఘవరెడ్డి–సుహాసిని దంపతులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు అన్నదానం ప్రారంభించారు. డాక్టర్ రమాదేవి, డాక్టర్ చందనారెడ్డి, చందుపట్ల శ్రీమంత్‌రెడ్డి, యూత్ నిర్వాహకులు జువ్వాజి రాజు, అశోక్, కుక్కల రమేశ్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లోని గణపతి మండపాల వద్ద భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు, మహా అన్నదానం చేపట్టారు. మహిళలు మంగళగౌరి వ్రతాలు ఆచరించారు. దీంతో భక్తుల సందడి నెలకొంది.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

- మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సంజీవరెడ్డి

ఆత్మకూరు : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి అన్నారు. మండల కేంద్రంతో పాటు తిరుమలగిరి గ్రామంలో ఆదివారం కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిందన్నారు. గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రభుత్వం న్యాయం చేయలేకపోతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని, ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, మాజీ ఏఎంసీ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి, నాయకులు రవియాదవ్, రవీందర్, కుమారస్వామి, సుధాకర్, సుధాకర్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో హరినామ సంకీర్తన



తిరుమలలో అఖండ హరినామ సంకీర్తన చేస్తున్న భజన మండలి బృందం

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామంలో గల శ్రీరామదాసు భజన మండలి సభ్యులు ఆదివారం తిరుమల తిరుపతి దేవస్థానంలో భజన కార్యక్రమాలు చేపట్టారు. మాడవీధుల్లో అఖండ హరినామ సంకీర్తన చేశారు. శ్రీరామదాసు భజన మండలి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మాందాడి రాజు, భజన మండలి కార్యదర్శి తడుక సదానందం, సభ్యులు రాజు, కుమారస్వామి, మహేందర్, రవి, రమేశ్, సాంబరెడ్డి, శ్రీధర్, శంకర్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.